కుంకి ఏనుగులను చూడటానికి కూడా లేదా..?

ప్రజాశక్తి పలమనేరు రూరల్ (గంగవరం): జిల్లాలో ఏనుగుల సమస్య ఎక్కువగా ఉన్నందున్న వాటిని కట్టడి చేయడానికి, ఏనుగుల దాడులను నివారించి వాటిని తిరిగి అడవిలోకి పంపడానికి కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి ఐదు కుంకి ఏనుగులను తీసుకొచ్చారు. వాటిని పలమనేరు రూరల్ మండలం జగమర్ల వద్ద వాటిని ఉంచారు. అలాగే గత వారం వాటి సందర్శనార్థం ప్రజలకు అనుమతి ఇచ్చారు కూడా. ప్రస్తుతం కుంకి ఏనుగులను చూడాటానికి వచ్చిన ప్రజలను అధికారులు అనుమతించకపోవడంతో వారు వెనుదిరుగుతున్నారు. ఏది ఏమైనప్పటికీ పలమనేరు నియోజకవర్గంలో అడవి ఏనుగుల దాడుల నుంచి కుంకి ఏనుగుల ద్వారా ఉపశమనం ఉంటుందో లేదో వేచి చూడాలని స్థానికులు అంటున్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి పిలుపు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

ఆదానీ కంపెనీ ప్రయోజనాల కోసమే స్మార్ట మీటర్లను బిగిస్తున్నారని, ప్రజలపై భారాలు మోపే స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ఆదివారం వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్ పిలుపు నిచ్చారు. గత ఎన్నికల సమయంలో లోకేష్ స్మార్ట్ మీటర్లును పగలగొట్టండని పిలుపు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లు పై నోరుమెదపకపోవడం అన్యాయమన్నారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా, విద్యుత్ ఛార్జీల భారాలకు వ్యతిరేకంగా ఈనెల 16 తేదీ నుండి ఆగస్టు 4 తేదీ వరకూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వ్యతికిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మెకు సీపీఎం మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమ్మె డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. టిటిడిని నిత్యం వివాదాలకు కేంద్రంగా మారుస్తున్నారని, కేంద్రంలోని బిజెపి నాయకులు, మంత్రులు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సైతం ఇందుకు మినహాయింపు లేకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తిరుపతిని కేంద్రం చేసుకుని మత ఉద్రిక్తతలు పెంచటమే బిజెపి లక్ష్యమని, ఈ చర్యల పట్ల ప్రజలు, భక్తులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ పేద ప్రజలకు విద్యను దూరం చేయడానికే స్కూళ్ల విలీనం వంటి చర్యలకు ప్రభుత్వం పాల్పడుతుందని విమర్శించారు. జిల్లా అభివృద్ధికి టిటిడి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రేషన్ షాపుల్లో ప్రతినెలా 1 నుండి 15 తేదీ వరకు సరుకులు పంపిణీ చేస్తామని చెప్పిన ఎక్కడ అమలు కాలేదన్నారు. జిల్లాలో గుర్తించిన సమస్యలపై నిరంతరం ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, టి.సుబ్రహ్మణ్యం, జిల్లా కమిటీ సభ్యులు పి.సాయిలక్ష్మి, ఆర్.లక్ష్మి, ఎస్.జయచంద్ర, కే.వేణుగోపాల్, శివకుమార్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈనెల 21వ తేదీన సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో 7వ తేదీ సోమవారం ఉదయం 9 .30గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో కూడా వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే నమోదైన అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు పోలీసుశాఖలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్' (ప్రజల ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం) సోమవారం ఉదయం 10.30గంటలకు పాత డిపీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పోలీస్ అధికారులకు నేరుగా తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. నగర పాలక సంస్థలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కర వేదికను సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ నరసింహప్రసాద్ కోరారు.

సమయపాలన పాటించని ఆర్టీసీ బస్సులు

గంటల కొద్ది వేచి చూస్తున్న ప్రయాణికులు

ప్రజాశక్తి- సోమల: పుంగనూరు ఆర్టీసీ డిపో నుంచి సోమల మీదుగా తిరుపతికి నడుస్తున్న బస్సు సర్వీసులు సమయపాలన పాటించకపోవడం కారణంగా ప్రయాణికులు గంటలకు వేచి చూడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. గత వారం రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. సోమల నుండి పుంగనూరుకు వెళ్లాలన్నా అటు తిరుపతికి వెళ్లాలన్నా బస్టాండులో గంటల కొద్ది వేసి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి రైలు ఇంజన్ వెనక ఉండే రైలు పెట్టేలాగా ఒకదాని వెంట ఒకటి నాలుగు ఐదు వస్తున్నాయని ఆ తర్వాత గంటల కొద్ది రావడం లేదని సమయపాలన పాటించకపోవడం వల్ల తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డిపో అధికారులు ప్రయాణికుల ఇబ్బందిని గుర్తించి సమయపాలన పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

షిర్డియాత్రకు 500 మంది

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రతి ఏటా శ్రీ అభయసాయి ట్రస్ట్ షిర్డిసాయి భక్తులను ట్రస్టు ద్వారా షిర్డియాత్రకు పంపుతోంది. గత 7 సంవత్సరాలుగా ఈ ఆనవాయితీ కొనసాగిస్తోంది. ఈ మేరకు ఎనిమిదో సారి షిర్టిసాయి యాత్రకు చిత్తూరు నుండీ 500 మంది భక్తులను పంపుతున్నట్లు టస్టు నిర్వహకులు రామూర్తిరెడ్డి, లోకేష్‌రెడ్డిలు తెలిపారు. స్థానిక కట్టమంచి షిర్టిసాయి ఆలయం నుండీ షిర్డియాత్రను జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, చిత్తూరు ఎంఎల్ఏ గురజాల జగన్మోహన్, తిరుపతి ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షిర్టిసాయి భక్తుల కోసం శ్రీ అభియసాయి ట్రస్ట్ ఉచిత రవాణా, భోజనం వసతి కల్పించి షిర్టియాత్రకు పంపడం అభినందనీయమన్నారు. యాత్రకు వెళ్ళుతున్న భక్తుల కోసం వాలంటీర్లు, వైద్యులను వెంటపంపుతున్నట్లు లోకేష్‌రెడ్డి తెలిపారు. యాత్రకు వెళ్ళుతున్నవారిని తిరిగీ క్షేమంగా చిత్తూరుకు చేర్చేంత వరకు ట్రస్ట్ బాధ్యత తీసుకొని అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనే లక్ష్యం

- ఎం.వెంకటరమణ, సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా అడిషనల్ కోఆర్డినేటర్

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేస్తూ తరగతి గదుల నిర్మాణం, ప్రహరీ గోడలు ప్రభుత్వ ఆదేశాలతో పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రి పంపిణీ చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులను కల్పించేలనే లక్ష్యంతో సమగ్రశిక్ష అభియన్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేయడం జరుగుతోందని సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా అడిషనల్ కోఆర్డినేటర్ ఎం.వెంకటరమణ తెలిపారు. ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో సమగ్రశిక్షా అభియన్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు గురించి తెలియజేశారు.

ప్రజాశక్తి : పాఠశాలల్లో ఎలాంటి మౌలిక వసతులుండాలి..?

ఏపీసీ: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో నీటి సరఫరాతో కూడిన మరుగుదొడ్లు, ఫ్యాన్లు, ట్యాబ్‌లైట్లు ఉండాలి. ఫర్నీచర్, శుద్ధి తాగునీటి సౌకర్యం, ప్రహరీగోడ ఉండాలి.

ప్రజాశక్తి : మరుగుదొడ్ల నిర్వహణ ఎలా ఉంది..?

ఏపీసీ: పాఠశాలల్లోని మరుగుదొడ్లను నిరతరం నీటి సౌకర్యం ఉండేలా చూసుకుంటున్నాం. అలాగే ప్రతి రోజు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరుగుడ్ల శుభ్రతపై ఫోటోలు తీసి పంపాల్సి ఉంటుంది. నిర్వహణ కోసం సిబ్బందిని నియమించడం జరిగింది.

ప్రజాశక్తి: ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకం ద్వారా జిల్లాలో ఎన్ని పాఠశాలను అభివృద్ధి చేస్తున్నారు..?

ఏపీసీ: ప్రధానమంత్రి స్కూల్స్ రేజింగ్ పథకం ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 61 పాఠశాలలను ఎంపిక చేశాం. ఈ పథకంలో మౌలిక వసతులతో పాటు ల్యాబ్, లైబ్రరీ, క్రీడా సదుపాయాలు కల్పించడం జరుగుతోంది.

ప్రజాశక్తి: మాడల్ స్కూల్ పరిస్థితి ఏమిటి.. జిల్లాలో గుర్తించిన మాడల్ స్కూల్స్ ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి..?

ఏపీసీ: చిత్తూరు జిల్లాలో 700 మాడల్ పాఠశాలలు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు మాడల్ స్కూల్‌ను ఆధునీకరించడం జరుగుతోంది. కుప్పం నియోజకవర్గంలో 35 మాడల్ స్కూల్ అప్‌గ్రేడ్ నిర్మాణ పనుల కోసం రూ. 10.36 కోట్లు కేటాయించడం జరిగింది. అభివృద్ధి పనులు జిల్లా కలెక్టర్ ఆదేశాలకు వంద రోజుల్లో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. అలాగే జిల్లాలో గుర్తించిన మాడల్ స్కూల్స్ అభివృద్ధి పనులు ప్రారంభించడం జరిగింది. సమగ్రశిక్షా అభియన్ ద్వారా త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- ఎం.వెంకటరమణ, సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా అడిషనల్ కోఆర్డినేటర్

మిథున్ రెడ్డి అరెస్ట్ కక్ష సాధింపులో భాగమే

- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , వైసీపీ నాయకులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : కూటమి ప్రభుత్వం సాధింపుల్లో భాగంగానే ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని అరెస్టు చేసిందని, మాజీ రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీకి పట్టుగొమ్మలుగా ఉన్న నాయకులను కక్ష సాధింపులు భాగంగానే అరెస్ట్ చేస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ వెంట మిథున్ రెడ్డి ఉన్నాడన్న కారణంగానే, అక్రమ కేసులు బనాయించారన్నారు. ఆయన ఏ తప్పు చేయలేదు, కడిగిన ముత్యముల తిరిగి వస్తారని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో దుర్మార్గపు పాలన చేస్తుందన్నారు. చంద్రబాబు, లోకేష్, పవన్ ఏ విధంగా రాష్ట్రంలో ఇబ్బందులు పెడుతున్నారో చూస్తున్నామన్నారు. దీనికి తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

ప్రజాశక్తి - కేవిబి పురం: మిథున్ రెడ్డి అరెస్ట్‌ను, కేవిబి పురం మండలం, వైసీపీ కార్యాలయం వద్ద ఆదివారం తిరుపతి జిల్లా వైస్సార్సీపీ ఉపాధ్యక్షులు తెరణి ధనంజేయులు రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సేవకు నిరంతరం కృషి చేసిన నాయకుడిపై అసత్య ఆరోపణలు మోపుతూ, అక్రమ కేసులు పెట్టి, అరెస్టు చేయడం చాలా బాధాకరమైన విషయమని ఆయన వ్యాఖ్యానించారు. కడిగిన ముత్యంలా ఎంపీ మిథున్ రెడ్డి బయటకు వస్తారని, అక్రమ కేసులతో జగన్మోహన్ రెడ్డి బలాన్ని, వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తల ధైర్యాన్ని పోగొట్టలేరని స్పష్టం చేశారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి అక్రమ అరెస్టు దారుణమని ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రియాశీలక కార్యదర్శి రాకేష్ కిరణ్ ఆరోపించారు. రాజకీయమంటే ప్రజా సేవని, గతంలో రాజకీయం ఉన్నత స్థానంలో ఉంటే ఈ ప్రభుత్వం ఆదం:పాతాళానికి తీసుకెళ్లిందన్నారు. రాజకీయం చేస్తే భావితరాలకు ఆదర్శంగా ఉండాలని, యువత రాజకీయాల్లోకి రావడానికి ఆసక్తి చూపేలా ఉండాలని ప్రభుత్వానికి హితవు పలికారు.

తప్పులు చేసిన వారికి శిక్షలు తప్పవు

- నరసింహ యాదవ్, టిడిపి నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గత వైసిపి హాయంలో ప్రజాధనాన్ని దోచుకుని అక్రమ పద్ధతిలో తప్పులు చేసిన ఎవ్వరూ శిక్షల నుండి తప్పించుకోలేరని, టీడీపీ ఏనాడు కక్ష సాధింపు చర్యలకు దిగదని తిరుపతి పార్లమెంటు టిడిపి అధ్యక్షులు నరసింహ యాదవ్ స్పష్టం చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడింది వైసిపి వారిని, ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపిన కార్యక్రమాలకు సంబంధించి సంబంధం లేని సెక్షన్లతో కేసులు పెట్టి ఇబ్బంది పెట్టింది వాస్తవం కాదాని ప్రశ్నించారు. త్వరలోనే తప్పులు చేసిన ఎంతటి వారినైనా కూడా కటకటాల వెనక్కు పంపడానికి కూటమి ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తుందన్నారు. కూటమి ఏడాది పాలనపై ప్రజలు ఆనందంగా ఉన్నారని తెలిపారు. నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణ మాట్లాడుతూ కక్ష సాధింపుకు పాల్పడింది వైసీపీ అని, దిష్టి బొమ్మలు తగలబెడితే కూడా హత్యా నేరం సెక్షన్లు పెట్టి కేసులు పెట్టడం వాస్తవం కాదాని ప్రశ్నించారు. త్వరలోనే ఈ లిక్కర్ స్కామ్ కు సంబంధించి జగన్మోహన్ రెడ్డితో సహా ఎవరైతే భాగస్వామ్యులు అయ్యారో వారందరూ కూడా జైలుకెళ్లాక తప్పదు అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో తిరుపతి నగర టిడిపి ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, సుబ్బు యాదవ్, శ్రీరాములు, రామారావు పాల్గొన్నారు.

మిథున్ రెడ్డి అరెస్టుపై హర్షం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మద్యం కుంభకోణంలో ఎంపి మిథున్ రెడ్డిని అరెస్టు చేయడంపై టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్ రావు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. దీంతో పుంగనూరు ఊపిరి తీసుకుందని అన్నారు. చంద్రబాబు అరెస్టు అంశాన్ని లోక్‌సభ లో ప్రస్తావించిన బిసి నాయకుడు, నాటి యువ ఎంపి రామ్మోహన్ నాయుడును అసభ్య పదజాలంతో దూషించిన మిథున్ రెడ్డి అహంకార ధోరణికి నొచ్చుకున్న కోట్లాది మంది బిసి ల హృదయాలు మిథున్ అరెస్టుతో సంతోషపడుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. మద్యం కుంభకోణంలో దోచుకున్న డబ్బును గత ఎన్నికలలో విచ్చలవిడిగా ఖర్చు చేయడంలో మిథున్ రెడ్డి పాత్ర అత్యంత కీలకపాత్ర అని ఆరోపించారు. టీడీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు డా.జి.దశరధాచారి, గాలి చలపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మా గుడి మాకు చాలు

- వద్దన్నా మారు గుడి నిర్మిస్తున్న ప్రకాశం జిల్లా శేషగిరి స్వామి
- కోర్టుకెళ్లినా తిరిగి నాయకుల అండతో విగ్రహ ప్రతిష్ఠ
- శేషగిరి వద్ద కొందరి ఫోటోలు, అనుమానాస్పద మందులు
- క్షుద్ర పూజలపై గ్రామస్తుల అనుమానం, నిరసన

ప్రజాశక్తి - తడ : తడ మండలం, కొండూరు గ్రామ సమీపంలో నేషనల్ హైవే మీద వున్న శ్రీ శ్రీ జగత్ చాముండేశ్వరి అమ్మవారి దేవాలయాన్ని ప్రకాశం జిల్లాకు చెందిన శేషగిరి స్వామి అనే వ్యక్తి అక్రమంగా నిర్మిస్తుండటంతో గ్రామస్తులు గతంలో గొడవలు చేసి అధికారులకు తెలిపి కోర్టుకు వేసి కట్టడాలను ఆపించారు. స్థానిక నాయకులు, కొందరు అధికారుల అండదండలతో మరలా వచ్చి గుడి నిర్మాణం చేపడుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. అమ్మ వారి విగ్రహం కూడా ప్రతిష్టించారని, ఈ గుడి మాకు వద్దు.. మా గ్రామ దేవత కోండూరు అమ్మ వారు గుడి మాకు చాలు అని స్పష్టం చేశారు. శేషగిరి స్వామి వచ్చినప్పటినుంచి గ్రామంలో పురుషులు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారుగా ఆయన వచ్చిన ఆరు నెలల్లో 17 మంది చనిపోయారని ఆయన క్షుద్ర పూజలు చేస్తున్నారనే ఆరోపణలు చేస్తున్నారు. ఈ ఆరోపణలకు బలం చేకూరేలా ఆయన వద్ద చాలా మందివి పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, పోస్టు కార్డు సైజ్ ఫొటోలు లభించాయి. వీటితో పాటు ఏవో తెలియని హోమియో పతి లేబుల్ వున్న బాటిల్‌లో ద్రవం వుందని, అది ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. శేషగిరి స్వామి గ్రామస్తుల రాకను గమనించి ఉదయం పారిపోయాడన్నారు. అని అతనిని పట్టుకొని అసలు నిజాలు బయటకు తేవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఆయనకు సహకరించిన వారిని సైతం విచారించాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. తడ ఎస్సై కొండప్ప నాయుడు, సూళ్లూరుపేట ఎస్సై బ్రహ్మయ్య నాయుడు వచ్చి గ్రామస్తులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ఈ విషయమై పై అధికారులకు తెలిపి తగు చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

శేషగిరి వద్ద దొరికిన ఫోటోలు, మందులు

ప్రతిభావంతులై సమాజానికి ఉపయోగపడాలి

గ్రాడ్యుయేట్ల బాధ్యత సమాజానికి అవసరం : లక్ష్మీనారాయణన్, క్రియా విశ్వవిద్యాలయం సహ వ్యవస్థాపకుడు

ప్రజాశక్తి - ఏర్పేడు : ఏర్పేడు సమీపం, ఐఐటి తిరుపతి క్యాంపస్‌లో 7వ స్నాతకోత్సవ వేడుకను ఐఐటి డైరెక్టర్ కెఎన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్రీయా విశ్వవిద్యాలయం సహ వ్యవస్థాపకుడు కాగ్నిజెంట్ అండ్ ఛాన్సలర్ లక్ష్మి నారాయణన్ పాల్గొన్నారు. జెఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, ఐఐటి తిరుపతి బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్‌పర్సన్ సజ్జన్ జిందాల్ అధ్యక్షత వహించారు. లక్ష్మీ నారాయణన్ మాట్లాడుతూ గ్రాడ్యుయేట్స్ విభిన్నవంతులై విభిన్న దృక్పథాలపై శ్రద్ధ వహించి మీ బాధ్యత సమాజానికి ఉపయోగపడాలని, అవసరమైన వారికి చేయూతనివ్వాలని, సరైన పరిష్కారం కోసం మాట్లాడాలని, సొంతంగా శీర్షికలు వ్రాయడం నేర్చుకుని ఆ కథలకు హీరోలుగా ఉండాలని తెలిపారు. సజ్జన్ జిందాల్ మాట్లాడుతూ గ్రాడ్యుయేటింగ్ విద్యార్థులు, అధ్యాపకులు, ఇన్స్టిట్యూట్ సిబ్బంది కృషిని అభినందించారు. టెక్నాలజీ మరియు సైన్స్ రంగంలో భారత ప్రభుత్వం చేపట్టిన కీలక కార్యక్రమాలపై విశ్లేషించారు. విక్షిత్ భారత్ – భారతదేశాన్ని అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మార్చే దార్శనికతకు ఆర్థిక, సామాజిక అభివృద్ధికి చాలా సమగ్రమైన విధానం అవసరం అన్నారు.

వివిధ డిగ్రీలలో పట్టభద్రులు: ఈ ఏడాది 417 మంది విద్యార్థులు పట్టభద్రులయ్యారు. వీరలో 212 బీటెక్, 91 ఎంటెక్, 53 ఎం ఎస్ సి, 16 ఎంపీపీ,13 ఎం ఎస్ (పరిశోధన), 28 పీహెచ్డీ, 01 ఎంటెక్ అండ్ పీహెచ్డీ డ్యూయల్ డిగ్రీ, 01 ఎం ఎస్ (పరిశోధన) అండ్ పిహెచ్డి డ్యూయల్ డిగ్రీ, 01 డిప్లొమా, 01 సర్టిఫికేట్ ఆఫ్ ఫౌండేషన్స్ ఇన్ ఇంజనీరింగ్ సైన్సెస్‌లో పట్టభద్రులయ్యారు.

ప్రత్యేక బహుమతులు ప్రధానం: 18 మంది విద్యార్థులు పతకాలు మరియు బహుమతులను పొందారు. 2025 బి.టెక్ గ్రాడ్యుయేట్లందరిలో అత్యుత్తమ విద్యా పనితీరుకు అరవింద్ శ్రీనివాసన్ కు రాష్ట్రపతి బంగారు పతకం లభించింది. 2025 బి.టెక్ గ్రాడ్యుయేట్లందరిలో పాఠ్యాంశాలు, పాఠ్యేతర కార్యకలాపాలలో అన్ని విధాలుగా రాణించినందుకు మేఘవర్షినికి గవర్నర్ బహుమతి లభించింది. యుజి, పిజి కార్యక్రమాలలో అగ్రస్థానంలో నిలిచిన వారికి బహుమతులు కూడా ప్రదానం చేశారు.

రేపు మండల సమావేశం: ఎంపీడీవో

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: ఈనెల 22వ తేది ఉదయం 10 గంటలకు గంగాధర నెల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అనిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కృష్ణ మహేష్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు వైస్ ఎంపీపీలు, జెడ్‌పిటిసి, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కావాలని కోరారు. అధికారులు ఆయా శాఖలకు చెందిన నివేదిక వివరాలతో హాజరు కావాలని ఆయన తెలిపారు.

బోరు మోటారుకు మరమ్మతులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

బోరు మోటారుకు మరమ్మతులు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ పార్వతీనగర్ గ్రామంలోని ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే బోరు మోటారు శనివారం కాలి పోయింది. సమస్యను గుర్తించిన పంచాయతీ కార్యదర్శి మేనక ఆదివారం ఉదయం బోరు మోటారు వద్దకు వచ్చి పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయించి ప్రజలకు తాగునీటిని సరఫరా చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో 70 కుటుంబాలు నివసిస్తున్నాయని శనివారం మధ్యాహ్నం బోరు మోటారు ఉన్నట్లుండి కాలిపోవడంతో సమస్య తమ దృష్టికి వచ్చిందని వెంటనే పంచాయతీ సిబ్బందికి తెలిపి బోరు మోటారుకు మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించామని తెలిపారు.

ఆలయంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి -బంగారుపాలెం: శ్రీ కామాక్షి సమేత స్వయంభు మొగిలీశ్వర స్వామి దేవస్థానంలో వేలూరుకు చెందిన అప్పర్ సన్మార్గ ఉయవార్ పని అరికట్టలై వారి ద్వారా దేవాలయం పరిశుభ్రత నిర్వహించారు. తమిళనాడు వేలూరు గుడియాత్తంకు, చెందిన అప్పర్ సన్మార్గ ఉయవార్ పని అరికట్టలై భక్తులు 80 మందితో దేవాలయం లోపల గోడలు, పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ధ్వజస్తంభం , నంది మండపం కోనేరు చుట్టూ పిచ్చి మొక్కలు తొలగించి ఆలయాన్ని శుభ్రం చేశారు. మీ సేవా సంఘం ద్వారా ఈ ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. అలాంటి ఉత్సవాలకు ముందు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఫ్లీ ఈ ఆలయంలో నిర్వహించాలని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ మునిరాజ, వంశపారంపర్య ధర్మకర్త ఎంబివిజయకుమార్, అర్చకులు కోరారు.

డాక్టరేట్‌ను స్వీకరిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటేష్ యాదవ్

వెంకటేష్ యాదవ్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం:

వెంకటేష్ యాదవ్‌కు డాక్టరేట్ వచ్చినట్టు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు మండలంలోని ఎన్‌పిసి నాయుడు కాలనీలో విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు పార్థసారధి కుమారుడు వెంకటేశ్ యాదవ్ తిరుపతి ఐఐటీలో స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ ఇన్ సివిల్‌లో పీహెచ్‌డీ పట్టా పొందారు. ప్రస్తుతం బెంగళూరులో సివిల్ ఇంజనీర్‌గా పనిచేస్తూ పిహెచ్‌డిపై ఆసక్తితో విద్య అభ్యసించి పీహెచ్‌డీ పట్టా అందుకున్నట్టు ఆయన తెలిపారు. వీరి తల్లిదండ్రులు ఉపాధ్యాయ వృత్తిలో ఉండడం వల్ల విద్య పట్ల ఆసక్తితో డాక్టరేట్ సాధించినట్టు ఆయన తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం

- ఒకే స్తంభానికి 11 కెవి విద్యుత్ లైను
- పొంచివున్న ప్రమాదం
- ప్రాణహాని సంభవిస్తే బాధ్యులెవరు?

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని మునిపల్లి గ్రామంలో 11 కెవి విద్యుత్ వీధిలైట్ల లైను ఒకే స్తంభానికి ఏర్పాటు చేశారు. ఆ స్తంభం సైతం చాలా ఏళ్ల కావడంతో విద్యుత్ స్తంభంపై భాగంలో పగిలిపోయి కూలే దశకు చేరుకుంది. విద్యుత్ లైన్లు తెగి పడితే ప్రాణ హాని కలిగే ప్రమాదం పొంచి వుంది. విద్యుత్ అధికారులకు సమస్యను పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ లైను వున్న స్తంభం స్థానంలో కొత్త స్తంభం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇంటి పక్కనే ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

మండలం లోని ఎం కొత్తూరు పంచాయతీ పరిధిలోని మునిపల్లి గ్రామం లోని వీధుల్లో 11 కెవి విద్యుత్ లైన్, విద్యుత్ దీపాల లైను ఒకే విద్యుత్ స్తంభంలో ఏర్పాటు చేశారు. పెద్ద ట్యాంకు ఉన్న వీధిలో విద్యుత్ స్తంభం పై భాగంలో పూర్తిగా పగిలిపోయి కూలే దశకు చేరుకుంది. ప్రమాదం పొంచి వుందని స్థానిక లైన్‌మ్యాన్ బాలకృష్ణను గ్రామస్తులు పదేపదే హెచ్చరిస్తున్నా చూసీ చూడనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు.

పొంచివున్న ప్రమాదం

దీనికి తోడుగా గ్రామంలోని ఇళ్ల సమీపంలో 11 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చారు. దీని ప్రభావం గాలివాన సంభవిస్తే వీధిలైట్లు మరమ్మతులకు గురవుతున్నాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే గ్రామంలో పెను ప్రమాదం జరిగే అవకాశం వుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని, గ్రామంలో 11 కెవి విద్యుత్ లైన్‌ను పురవీధుల నుండి తొలగించి వ్యవసాయ బోర్ల వద్దకు నూతన లైను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పై భాగంలో పగిలిపోయి కూలే దశకు చేరుకున్న విద్యుత్ స్తంభం

విద్యుత్ షాక్‌తో టిడిపి కార్యకర్త మృతి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: విద్యుత్ షాక్‌తో టిడిపి కార్యకర్త మృతి చెందిన సంఘటన గంగాధర నెల్లూరు మండలం పాత పాల్యం పంచాయతీ మిట్ట కొత్తూరు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. మిట్ట కొత్తూరు గ్రామంలోని వరదరాజుల నాయుడు కుమారుడు, టిడిపి కార్యకర్త ఎం లోకేష్ (36) ఆదివారం ఆడి కృత్తిక పండుగ కావడంతో ఒక్కపొద్దులకు మునగ కాయలు, మునగ ఆకు కోస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ సంఘటనపై గంగాధర నెల్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. యువ టిడిపి కార్యకర్తను కోల్పోయామని స్థానిక సర్పంచ్ కృష్ణమ నాయుడు, యువ నాయకుడు సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. యువకుడు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

65 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - రామకుప్పం :జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో కుప్పం పిఈయస్ వైద్యశాల రామకుప్పంలోని శ్రీవల్లిదేవ సేనా సమేత సుబ్రహ్మణ్య స్వామి దేవాలయం వద్ద ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో మండలం లోని వివిధ గ్రామాల నుండి 65 మంది కంటి రోగులు చికిత్సలు స్వీకరించారు. వారందరికీ పరీక్షలు నిర్వహించి 10 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు నిర్ధారించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు చైత్ర, జాహ్నవి, అఖిల, దేవాలయ అభివృద్ధి కమిటీ పాల్గొన్నారు.

పుష్పకావిళ్ల ఊరేగింపు

ప్రజాశక్తి - సోమల: మండల కేంద్రం సోమల పంచాయతీ అడుసు పల్లె గ్రామంలోని 30 కుటుంబాలు ఆడికృత్తిక సందర్భంగా ఆదివారం ఉదయం పుష్పకావిళ్లతో ఊరేగింపుగా తమిళనాడు తిరుత్తణికి వెళ్లారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

గంగాధర నెల్లూరు: ఆడినెల సందర్భంగా మండలంలోని ఎట్టేరి గ్రామంలోని వల్లి దేవసేన సమేత శివ షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో అర్చకులు ఆనంద అయ్యంగార్ ఆధ్వర్యంలో విశేష సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి విశేష పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని చుట్టుపక్కల గ్రామస్తులు కావడి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

కరాటేలో సత్యవాణి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - రామకుప్పం: కడపలో నిర్వహించిన ఫోర్త్ సౌత్ ఇండియా నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్-2025 పోటీల్లో రామకుప్పం సత్య వాణీ ఇంగ్లీష్ మీడియం హై స్కూలుకు చెందిన ఐదుగురు విద్యార్థులు విశేష ప్రతిభ చాటుకున్నారు. ఈ కరాటే పోటీల్లో తొమ్మిదవ తరగతి చదివే ఈశ్వర్ సీనియర్ విభాగంలో మూడవ స్థానంలో బహుమతి, అన్న నాలుగవ స్థానంలో బహుమతులు సాధించారు. ఎనిమిదవ తరగతి విద్యార్థి రియాజ్ మొదటి బహుమతి, ఆరవ తరగతి చదివే శశికుమార్ రెండవ స్థానంలో బహుమతి, భవ్య మూడవ స్థానంలో బహుమతి సాధించారు. చదువులతో పాటు కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ కె సంజయ్ కుమార్, ప్రధానోపాధ్యా యురాలు ఉషశ్రీ, కరాటే మాస్టర్ సింగార్ వేలు, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు అభినందించారు.

కరాటేలో ప్రతిభ చూపిన సత్యవాణి హైస్కూలు విద్యార్థులు

గ్రామాల్లో మౌలిక వసతులు కరువు

కాంగ్రెస్ ఇన్‌ఛార్జి బివిఎం శివశంకర్

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలో కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోని గ్రామాలు ఎన్నో ఉన్నాయని పలమనేరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి బివిఎం శివశంకర్ అన్నారు. 'పల్లె పల్లెకు కాంగ్రెస్'లో భాగంగా మండలంలోని కొళత్తూరు గ్రామ పంచాయతీలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రోడ్లు మరమ్మతులకు నోచుకోలేదని, అంతే కాకుండా డ్రైనేజీలు పూర్తిగా లేకపోవడం వల్ల మురికి నీరు, వర్షపు నీరు, మరుగుదొడ్ల నుంచి వచ్చే నీరు రోడ్డుపై నిలిచి ఉండడం వల్ల సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం వుందని ప్రజా ప్రతినిధులు, అధికారులు సమస్యలను పరిష్కరించాలని కోరారు. గ్రామ ప్రజలు నిత్య జీవనంలో తీవ్ర అవస్థలు పడుతుంటే, గ్రామానికి డ్రైనేజీ, మంచిరోడ్లు వంటి మౌలిక వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం ఎందుకు చేస్తున్నారో ప్రజా ప్రతినిధులను నిలదీయాలని ప్రజలకు న్యాయం జరిగేవరకు పోరాడుతామన్నారు. అధికారులే కాకుండా స్థానిక పాలకులు కూడా తమ బాధ్యతను నిర్వర్తించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ కుమార్, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు దొరస్వామి, ఎస్ఎస్ఎల్ అధ్యక్షుడు రెడ్డప్ప, బీసీ సెల్ అధ్యక్షుడు లక్ష్మణ్, మండల ఉపాధ్యక్షుడు చిన్న మల్లప్ప, స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల సమస్యలు పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: కబడ్డీ క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశామని కబడ్డీ శిక్షకులు అరవింద్ బాబు తెలిపారు. ఆదివారం మండ ల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదా నంలో క్రీడాకారులకు దుస్తు లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అరవింద్ బాబు మాట్లాడుతూ గత వేసవి కాలంలో కబడ్డీ శిక్షణ పొంది న వారికి వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి క్రీడా దుస్తులు వితరణ చేశారని క్రీడల్లో ప్రతి ఒక్కరూ రాణించాలనే ఉద్దేశంతో వీటిని అందించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దాత

పాలేటమ్మ జాతరకు భారీ బందోబస్తు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం నెల్లిమంద పంచాయతీలో వైభవంగా నిర్వహించే పాలేటమ్మ జాతర నిర్వహణకు 25 మందితో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ శివశంకర్ తెలిపారు. జిల్లాలోని అత్యంత వైభవంగా నిర్వహించే జాతర కోసం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలోని గ్రామాల నుండి దాదాపు 20 చాందిని బండ్లు రానున్నాయని ప్రతి బండి వద్ద బందోబస్తు ఏర్పాటు చేయడం శాంతి భద్రతలను పరిశీలిస్తారని తెలిపారు.

పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్ఐ

రాష్ట్రంలో 22 ప్రాజెక్టులు ఏర్పాటు : మాజీ ఎమ్మెల్సీ

పజాశక్తి -శాంతిపురం:

ముఖ్యమంత్రి చంద్రబాబు , విద్యా శాఖ మంత్రి లోకేష్ ల కృషి ఫలితంగా కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో 22 ప్రాజెక్టులు రూ.39,473 కోట్లతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు కానున్నాయని మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి, మాజీ టీటీడీ బోర్డు సభ్యులు గౌని వారి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పారిశ్రామిక వికేంద్రీకరణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్దపీట వేశారన్నారు. ఎనిమిదవ ఎస్ఐపిబి సమావేశంలో ముఖ్యమంత్రి ఈ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారన్నారు. శ్రీకాకుళం నుండి చిత్తూరు వరకు శ్రీ సిటీ నుండి కర్నూలు వరకు ఈ ప్రాజెక్టులు ఏర్పాటు కానున్నాయన్నారు. 30,899 ముందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయన్నారు. పరిశ్రమలు, ఇంధనం, పర్యాట కం, ఐటి, ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులు ఏర్పాటు అవుతున్నాయన్నారు. విశాఖపట్నంలో పినామ్ పీపుల్స్ ప్రాజెక్ట్ 25 కోట్లతో ఏర్పాటుతో 2,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తుందన్నారు. చిత్తూరులో శ్రీజ మహిళా ప్రొడ్యూసర్ కంపెనీ రూ.282 కోట్లతో ఏర్పాటు అయితే 1400 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. వీటితో పాటూ పలు జిల్లాలలో పలు కంపెనీలు ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. శిక్షణ పొందిన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు.

అదును తప్పిన వర్షాలు

- అయోమయంలో రైతులు
- ఖరీఫ్ సీజన్లో ముందుకు సాగని వ్యవసాయ పనులు
- భారీగా తగ్గిన వేరుశనగ సాగు

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు నియోజక వర్గంలో ఖరీఫ్ సీజన్లో అదును దాటిన వర్షాల వల్ల రైతులు నిట్ట నిలువునా మునిగి సమయానికి పంటలు వేయలేక, అప్పులు తీర్చలేక అయోమయంలో బిక్కుబిక్కుమని కొట్టుమిట్టాడుతూ ఆకాశం వైపు ఎదురుచూస్తున్న పరిస్థితి ఏర్పడింది. వేరుశనగ కాయలు వేయడానికి సకాలంలో వర్షం పడడం వల్ల గత నెలలో ప్రభుత్వం పంపిణీ చేసిన వేరుశనగ విత్తనాలను ఆ తర్వాత వర్షం పడక పోవడంతో ఆహారంగా వండుకొని తింటున్న పరిస్థితి ఏర్పడింది. వేరుశనగ విత్తనం వేసే సమయం మించిపోయిన తర్వాత పలమనేరు నియోజకవర్గంలో వర్షాలు ప్రారంభ మయ్యాయి. దీంతో ఏం చేయాలో రైతులకు దిక్కుతోచడం లేదు. సాధారణంగా ఖరీఫ్ సీజన్ జూన్ నెలతో ప్రా రంభమవుతుంది. చిత్తూరు జిల్లాలో ఖరీఫ్ సీజన్ ఎక్కువగా వేరుశనగ పంటను సాగు చేస్తారు. ఈ పంట పూర్తిగా వర్షాధారంగా పండిస్తారు. ఇప్పటికే జిల్లాలో వేరు శనగ విత్తి, కలుపు తవ్వకానికి వచ్చి ఉండాలి. కానీ వర్షాలు లేని కారణంగా జిల్లాలో వేరుశనగ పంట సాగు కాలేదు. మిగిలిన ఖరీఫ్ పంటలు కూడా అంతంత మా త్రమే. అదును పోయిన తర్వాత పడుతున్న ఈ వర్షాలు వల్ల ఉపయోగంలేదని వ్యవసాయ శాఖ అధికారులు సైతం చెబుతున్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రయత్నం చేయాలని కోరుతున్నారు. ప్రత్యా మ్నాయ పంటగా టమోటా, బీన్స్ , బెండ ముల్లంగి పంటలు వేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు ప్రతిపాదిస్తున్నారు.

ఈ ఖరీఫ్ సీజన్ కు చిత్తూరు జిల్లాలో అన్ని రకాల పంటలు 20 వేల హెక్టార్లలో సాగు కావాల్సి వుంది. గత సంవత్సరం ఈ తేదీ వరకు 18 వేల హెక్టార్లలో ఖరీఫ్ పంటలు సాగు అయ్యాయి. ఈ సంవత్సరం 1000 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగు అయ్యాయి. జిల్లాలో వేరుశనగ 18 వేల హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా, ఇప్పటివరకు 1200 హెక్టార్లలో మాత్రమే సాగయింది. రాగులు 663 హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా ఇప్పటివరకు 37 హెక్టార్లలో, కందులు 642 హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా 57 హెక్టార్లలో మాత్రమే సాగు అయింది. జిల్లాలో అలసందలు, ఆనుములు, కందులు అసలు సాగు కాలేదు. ఈ పంటలను జూలై మొదటి వా రం లోపు వేయాల్సి ఉంది తర్వాత వేయడం వలన పంట ఆలస్యం అవుతోంది. పంట చేతికి అందే దశలో వర్షాలు పడకపోవడంతో ఆ పంట చేతికి అందకపోవచ్చు. ఇప్పుడు పడుతున్న వర్షాలకు ఏయే పంట వేయాలో రైతులకు దిక్కుతోచడం లేదు. జిల్లాలో గత రెండు రోజులుగా వర్షాలు పడుతున్నాయి.

ఈ ఖరీఫ్ సీజన్‌కు వ్యవసాయ శాఖ జిల్లాలోని రైతులకు 39 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు సర ఫరా చేసింది. 26 వేల క్వింటాళ్ల వేరుశనగను జిల్లా వ్యాప్తంగా రైతులకు రైతు సేవ కేంద్రాల ద్వారా అందించారు. ఈ విత్తనం చాలదని అదనంగా వేరుశనగ కావాలని జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు కలెక్టర్ కు ప్రతిపాదించారు. దీంతో అదనంగా మరో 13 వేల క్వింటాల్లో వేరుశనగను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ విత్తనాన్ని కూడా రైతులకు సరఫరా చేశారు.

రైతులు విత్తనాలను సిద్ధం చేసుకుని వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. అయితే పడాల్సిన సమయంలో వర్షం పడకపోవడంతో జిల్లాలో వేరుశనగ సాగు కాలేదు. రైతులు దుక్కులు దున్ని వరుణుడి కోసం ఎదురు చూస్తూ గడిపారు. సీజన్ పూర్తయిన తర్వాత ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయి. ఇప్పుడు వేరుశనగ సాగు చేస్తే పంట ఆలస్యం అవకాశముంది. చివరి దశలో వర్షాలు పడకపోతే పంట చేతికి వచ్చే అవకాశాలు లేవు. గత సంవత్సరం కూడా జిల్లాలో ఇదే పరిస్థితి ఎదురయ్యింది. వేరుశనగ పంట తీసే సమయంలో రెండు నెలల పాటు జిల్లాలో వర్షాలు పడలేదు. దీంతో వేరుశనగ పంట చిత్తూరు జిల్లాలో 90 శాతం దెబ్బతింది. ఈ సంవత్సరం వేరుశనగ విత్తడానికి ముందు రెండు నెలలుగా వర్షాలు లేవు. ఫలితంగా గత సంవత్సరం నష్టపోయిన

విధంగానే ఈ సంవత్సరం కూడా వేరుశనగ రైతులు నష్టపోయే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో గత నాలుగు ఐదు సం వత్సరాలుగా సకాలంలో వర్షాలు పడడం లేదు. వేరుశనగ పంట చేతికి రావడం లేదు. ఇందుకు తోడు జిల్లాలో అడవి పందుల బెడద విపరీతంగా వుంది. వేరుశనగ పంట వేస్తే పంట మొత్తాన్ని గుంపులు గుంపులుగా వ చ్చి అడవి పందులు ధ్వంసం చేస్తున్నాయి. దీంతో జిల్లా రైతులు వేరుశనగ వేయడానికి ముందుకు రావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న 39 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు వాడే పరిస్థితుల్లో లేదు. ఆ విత్తనాన్ని రైతులు చట్నీలకు, నూనె ఆడించుకోవడానికి వినియోగించడం గమనార్హం.

క్రైం న్యూస్

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

ఒకరికి గాయాలు

గాయపడిన జస్వంత్

ప్రజాశక్తి - రొంపిచర్ల: కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన రొంపిచర్ల పోలీస్ స్టేషన్‌కు సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. జాండ్ల వారిపల్లి గ్రామం దుస్సా వాండ్లపల్లిలో ఓ విందు కార్యక్రమంలో పాల్గొని స్నేహితుడిని రొంపిచర్ల క్రాస్‌లో వదిలి రావడానికి నలుగురు యువకులు కారులో బయలుదేరారు. రొంపిచర్ల పోలీస్ స్టేషన్ సమీపంలో పెట్రోల్ బంకు వద్ద రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో కారు తీవ్రంగా దెబ్బతింది. కారులో ఉన్న జస్వంత్ కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన జస్వంత్ ను చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రొంపిచర్ల పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో వున్న నిందితుడు

కర్ణాటక మద్యం పట్టివేత

వ్యక్తి అరెస్టు, ద్విచక్ర వాహనం స్వాధీనం

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: వాహనాల తనిఖీ సమయంలో కర్నాటక మద్యాన్ని గుర్తించి ఆ వ్యక్తితో పాటూ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ పరశురాముడు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు మండలంలోని నెల్లిపట్ల కోల మాసనపల్లి జాతీయ రహదారిలోని చప్పిడిపల్లి క్రాస్ వద్ద ఎస్ఐ పరశురాముడు తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంలో ఓ వ్యక్తి వస్తూ తప్పించుకోవడానికి ప్రయత్నించాడు. సిబ్బంది సహాయంతో పట్టుకుని పరిశీలించగా కర్ణాటక మద్యం 190 ప్యాకెట్లు ద్విచక్ర వాహనంలో తరలిస్తున్నట్లు గుర్తించారు. ఇతను నెల్లిపట్ల గ్రామానికి చెందిన ఆలిం బాషగా గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకొని స్థానిక ఎస్ఐ పరశురాముడు వారి వద్ద ఉన్న స్ప్లెండర్ ద్విచక్ర వాహనాన్ని, 9,500 రూపాయల విలువ చేసే కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రహదారిపై బోల్తా పడిన లారీ

కల్వర్టును ఢీకొని లారీ బోల్తా

ప్రజాశక్తి -వి కోట : మండల పరిధిలోని నాయకనేరి చెరువు సమీపంలో జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు కల్వర్టును ఓ లారీ ఢీకొని బోల్తా పడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుండి తమిళనాడు రాష్ట్రం చెన్నైకు పేపర్ బేల్ల లోడుతో వెళుతున్న లారీ ఆదివారం సాయంత్రం నాయకనేరి సమీపంలో చెరువు మొరవ వద్ద ప్రమాదవశాత్తు కల్వర్టను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీలోని పేపర్ బేళ్లు రోడ్డుపై పడ్డాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీనికి తోడు చిరుజల్లులు పడుతుండడంతో స్థానికుల సహకారంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందింది.

శ్వాస సంబంధిత వైరస్‌పై అవగాహన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: శ్వాస సంబంధిత సింకిటియల్ వైరస్ (ఆర్ఎస్‌వి) పై అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ (ఐఎపి) జాతీయ అధ్యక్షులు డాక్టర్ వసంత్ ఎం.ఖలాత్కర్ తెలిపారు. ఈ వైరస్ ఐదేళ్ళలోపు పిల్లల్లో, శిశువుల్లో దిగువ శ్వాసనాళ సంబంధిత ఇన్ఫెక్షన్లకు దారి తీస్తోందన్నారు. సంబంధిత టీకీలపై అవగాహన చాలా అవసరమని తెలిపారు. చేతులు కడుక్కోవడం వంటి పరిశుభ్రత పాటించాలని సూచించారు. దీర్ఘకాలిక మోనోక్లోనల్ యాంటీబాడీలు అందుబాటులో ఉన్నాయని చిన్నారుల రక్షణకు ఇవి దోహదపడతాయని తెలిపారు. ఇప్పటికే పలివిజుమాబ్ అనే మందు హై-రిస్క్ శిశువులకు అందుతోందన్నారు. 2025 ఏప్రిల్‌లో, సానోఫీ, డాక్టర్ రెడ్డీస్ కలిసి శిశువులను ఆర్ఎస్‌వి సంబంధిత సమస్యల నుంచి రక్షించేందుకు రూపొందించిన, ఒక కొత్త డోసుతో ఇవ్వగల టీకాను భారత్‌కు తీసుకురావడానికి తమ భాగస్వామ్యాన్ని విస్తరిస్తోందని తెలిపారు. తల్లిదండ్రులు, సంరక్షకులు ఈ విషయంలో మరిన్ని వివరాల కోసం తమ పీడియాట్రిషన్, నెయోనటాలజిస్ట్‌ను సంప్రదించాలన్నారు.

బొజ్జల వాలీబాల్ టోర్నీ విజేత కొనేపల్లి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో రెండు రోజులపాటు సాగిన బొజ్జల వాలీబాల్ టోర్నీ విజేతగా కోనేపల్లి జట్టు నిలిచింది. ఆదివారం విజేతలకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ కప్పును, ప్రైజ్ మనీని అందజేశారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించేందుకు సుధీర్ రెడ్డి మంచి ప్రయత్నం చేస్తున్నారని బృందమ్మ కొనియాడారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడంలో బొజ్జల కుటుంబం ఎల్లప్పుడూ ముందుంటుందని హామీ ఇచ్చారు. అనంతరం విజేతకు రూ. 20 వేలు, రన్నరప్ కు రూ. 15 వేలు, 3, 4 స్థానాల్లో నిలిచిన జట్లకు చెరో రూ.5 వేలు చొప్పున ప్రైజ్ మనీ అందించారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నడకతో దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం పొందుకోవచ్చని పుత్తూరు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ తెలిపారు. ఆదివారం పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ భవనంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కే ఎల్ మూర్తి ఆధ్వర్యంలో వాకర్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్ సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. పరిసరాలను ప్రతి ఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుధ్య సమస్యలను తనదృష్టికి తేవాలని సూచించారు.

టీచర్స్ క్రికెట్ లీగ్ సన్నాహక సమావేశం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న టీచర్స్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్-2025 సన్నాహక సమావేశం కుమ్మరి వీధిలోని ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశం ప్రగతి సేవా సంస్థ, అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, పలు జట్ల ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించారు.